ఐరాల: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



యాదమరిలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార సభకు హాజరైన ప్రజలు



మళ్లీ జగనన్న విజయం తథ్యం

- సీఎం జగన్ చేసిన మేలు మర్చిపోవద్దు
- చంద్రబాబును నమ్మితే జన్మభూమి కమిటీలు తెచ్చి దోచేస్తారు
- ఎన్ని పార్టీలు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే గెలుపు
- ఎన్నికల ప్రచార బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రజాదరణ చూసి తట్టుకునే శక్తి చంద్రబాబుకు లేదని, ఆయన ఎన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పాతపాళ్యంలో ఆదివారం ఎంపీ రెడ్డెప్ప, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మండల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి పాల్గొన్నారు. ముందుగా స్థానిక వైఎస్సార్‌సీపీ నేత పూజారి మోహన్‌రెడ్డి మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం మణికంఠేశ్వర స్వామి ఆలయంలో పెద్దిరెడ్డి శివయ్యకు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచార బహిరంగ సభలో పాల్గొని మాట్లాడారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని గుర్తుచేశారు. ముఖ్యంగా పొదుపు మహిళలు, రైతులకు రుణ మాఫీ చేస్తానని చెప్పిన చంద్రబాబు అధికారం చేపట్టాక మోసం చేయడంతో 2019 ఎన్నికల్లో ప్రజలు ఆయనకు బుద్ధి చెప్పారని తెలిపారు. 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పక్కాగా అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. సీఎం జగన్ ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా చేస్తున్న మేలును మరవద్దన్నారు.

గ్రామ స్వరాజ్యానికి పునాది

సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి, గ్రామ స్వరాజ్యానికి పునాది వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని మంత్రి చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారని చెప్పారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అంతా కలిసికట్టుగా పార్టీ గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబుకు ఓటేయడం అంటే సంక్షేమం, అభివృద్ధిని వద్దనుకోవడమేనని స్పష్టం చేశారు. చంద్రబాబు మళ్లీ జన్మభూమి కమిటీలు తీసుకొచ్చి దోపిడీ చేయాలనే లక్ష్యంతో గోతికాడ నక్కలా కాచుకుని ఉన్నాడని ధ్వజమెత్తారు. చంద్రబాబు లాంటి స్వార్థపరులకు ఓటుతోనే బుద్ధి చెప్పి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల్లో బాబు వస్తే జాబు వస్తుందని ఉన్న జాబులను కూడా ఊడబీకిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చి తరువాత రెండు లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించి చరిత్ర తిరగరాశారన్నారు.

ప్రజల సంక్షేమానికి జగన్ కృషి

రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమానికి జగనన్న నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప అన్నారు. పిల్లలందరికీ ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో అమ్మఒడి, విద్యాకానుక, తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అభ్యర్థించారు. టీడీపీ నేతల ప్రలోభాలు, మాయమాటలకు మోసపోవద్దని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. జగనన్న ప్రభుత్వంలో ఊహకందని విధంగా అభివృద్ధి చేశామన్నారు. నాడు– నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరిందని తెలిపారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. చంద్రబాబు జీవితమంతా పొత్తులు, అతుకులు, బొంతలు తప్పితే ఏదీ లేదని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలజా ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ మోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ సుచిత్ర, టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల పార్టీ నేతలు పాల్గొన్నారు.



బంగారుపాళెం: ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి

హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌దే

బంగారుపాళెం: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని ప్రసంగించారు. అంతకు ముందు ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అరగొండరోడ్డు వద్ద గల పార్టీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. కరోనా కష్టకాలంలో రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను సకాలంలో నెరవేర్చారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో యువతకు 4.5 లక్షల ఉద్యోగాలను కల్పించారన్నారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో మళ్లీ సీఎంగా గెలిపించుకునేందుకు కార్యకర్తలు, నాయకులు కలసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ సునీల్‌కుమార్, చిత్తూరు ఎంపి అభ్యర్థిగా రెడ్డెప్పను ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలించాలన్నారు

చంద్రబాబును నమ్మకండి

ప్రజలను మోసగించి అధికారం దక్కించుకునేందుకు చంద్రబాబు బూటకపు హామీలతో వస్తున్నాడని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని మంత్రి పెద్దిరెడ్డి పిలుపునిచ్చారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు 600 హామీ ఇచ్చిన బాబు ఒక్కటైనా నెరవేర్చారా అని ప్రశ్నించారు. కరోనాతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే బాబు, లోకేష్, బాలకృష్ణ హైదరాబాద్‌లో గడపదాటి బయటకు వచ్చి ప్రజలను పలకరించిన పాపాన పోలేదని గుర్తుచేశారు. 2024 ఎన్నికలు సమీపించడంలో మళ్లీ కొత్త ఎత్తులతో సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామంటూ మహిళలను, యువతను, రైతులను మోసగించేందుకు వస్తున్నారన్నారు. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, నియోజకవర్గ పరిశీలకుడు మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మరింత పెంచి ఇస్తాం



ర్యాలీ చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

యాదమరి: మరో ఐదేళ్లలో రాష్ట్రంలో ఇప్పుడు అందిస్తున్న పథకాలతోపాటు మరిన్ని పెంచి ఇస్తామని విద్యుత్, అటవీ శాఖ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తెలిపారు. మండలంలోని చెన్నారెడ్డి పల్లెలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రితోపాటు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయ రెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించుకుంటే ప్రస్తుతం అమలవుతున్న పథకాలన్నీ అందుతాయని, వీటితోపాటు మరింత పెంచి ఇచ్చేందుకు ఆలోచిస్తున్నారన్నారు. సభకు విచ్చేసిన మంత్రికి పెరుమాళ్లపల్లె వద్ద మనోహర్ రెడ్డి అధ్యక్షతన మంత్రిని పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రంలోకి రాగానే జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, బీఎంఆర్ సంస్థల అధినేత మోహన్ రెడ్డి భారీ జనసందోహం మధ్య ర్యాలీగా సభా ప్రాంగణానికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశుసంక్షేమశాఖ రాయలసీమ జోన్ చైర్‌పర్సన్ శైలజా చరణ్ రెడ్డి, ఎంపీపీ మనోహర్ రెడ్డి, నాయకులు మనోహరన్, కబీర్‌బాషా, వాసురెడ్డి, హరనారాయణ రెడ్డి, రవీంద్రబాబు, మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

తవణంపల్లె: జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార సభను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, పూతలపట్టు అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పారిశ్రామికవేత్తలు హైమాఘం సుగుణాకర్ రెడ్డి, జి.ప్రకాష్ రెడ్డి, మోహన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మంత్రి ప్రసంగిస్తూ చంద్రబాబునాయుడు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలు ఇంటికి సాగనంపారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు పోకల అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, పార్టీ నాయకులు గాంధీబాబు, హరికృష్ణారెడ్డి, కరీం, శరత్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌బాబు రెడ్డి, వివేకానందరెడ్డి, రవిరెడ్డి, దూర్వాసులు రెడ్డి, కిషోర్ రెడ్డి, జగన్నాథరెడ్డి, వంశీరెడ్డి, సుకేష్ రెడ్డి, సాయి రెడ్డి, తేజారెడ్డి, మధుకుమార్, దినేష్‌రెడ్డి, స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు.



తవణంపల్లెలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రశాంత ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యం

పూతలపట్టు: ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని ఆర్డీఓ(ఆర్వో) చిన్నయ్య తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. నియోజకవర్గ స్థాయిలో 1,08,400 మంది పురుషులు, 1,11,577 మంది మహిళలు, ఏడుగురు ఇతరులతోకలిపి మొత్తం 2,19,984 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందులో సర్వీస్ ఓటర్లు 1,039 పురుషులు, 29 మహిళలతో కలిపి 1,068 మంది ఉన్నట్లు తెలిపారు. ఐరాలలో 43 పోలింగ్ కేంద్రాలు, పూతలపట్టు 42, తవణంపల్లె 56, బంగారుపాళ్యం 68, యాదమరి 51తో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని పోలీసులు, రెవెన్యూ అధికారులు చర్చించి నియోజకవర్గంలో 67 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా, 197 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో నియోజకవర్గంలోని బస్టాండ్, పోస్టాఫీస్, గోడలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ వాహనాలపై రాజకీయ చిత్రాలు, పేర్లు ఉండకూడదని, ఆ విధంగా ఉంటే అధికారులు వెంటనే తొలగిస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని 24 మంది నోడల్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, డీటీ(ఎన్నికలు) మహేశ్వరి, ఏఎ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, రీసర్వే డీటీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య

నియోజకవర్గంలోని ఓటర్లు

వయస్సు	ఓటర్ల సంఖ్య
18–19	4,579
20–29	36,083
30–39	53,441
40–49	53,851
50–59	35,196
60–69	22,324
70–79	11,150
80–89	3,048
90–99	306
100ఏళ్లుపైబడిన వారు: 06	
మొత్తం	2,19,984

ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి

చిత్తూరు కార్పొరేషన్: ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని ఆ పార్టీ చిత్తూరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక 6వ డివిజన్ సంజయ్‌గాంధీ నగర్, చుట్టు పక్కల ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిందని త్వరలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. ప్రజలందరూ ఆలోచించి సంక్షేమ పాలన అందించే వారిని ఎన్నుకోవాలని కోరారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జగనన్న ప్రజలకు ఏదో ఒక పథకం రూపంలో ఆర్థికంగా సాయం చేస్తున్నారని చెప్పారు. టీడీపీ కి దోచుకోవడం తప్ప పంచడం తెలియదన్నారు. ఎంతసేపు ఆ వర్గం వారు బాగుండాలనే ఆలోచన తప్ప ప్రజలకు మంచి చేయాలన్న యోచన ఉండదన్నారు. ఎలాగూ గెలవలేం కాబట్టి కూటమి పేరుతో అందరూ కలిసి ప్రభుత్వాన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఇచ్చిన మాట కోసం నిలబడే వ్యక్తి జగనన్న అన్నారు. ఓటును ఫ్యాన్ గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ రాంగణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక కార్పొరేటర్ అజగర్‌బాను, కార్పొరేటర్ హరిణిరెడ్డి నాయకులు చాన్‌బాషా, మురళీ రెడ్డి,బబ్లూ, ప్రతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి అభ్యర్థులను ప్రకటించిన నాయకుడు జగన్

గుడిపాల: రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యే అభ్యర్థులను ఒకేసారి ప్రకటించిన దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని పాపసముద్రం పంచాయతీలో ఆదివారం స్థానిక సర్పంచ్ చిట్టిబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. ఇక విజయం కూడా అలాగే ఉంటుందని చెప్పారు. ప్రతి కుటుంబానికి ఏదో విధంగా మేలు చేసిన జగన్‌ను ఎప్పుడూ మరిచిపోరని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను 99శాతం అమలుచేసి పేదల ఆర్థిక స్థితిగతులను మార్చారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ఆడపడుచులు, వృద్ధులు, ఓటర్లందరూ జగనన్నకు అండగా ఉంటామని చెబుతున్నారని చెప్పారు. చంద్రబాబు మాటలను ఎవరూ నమ్మడం లేదని, 2014లో రుణమాఫీ పేరిట నట్టేట ముంచారని గుర్తుచేశారు. అమ్మ ఒడి, దశలవారీగా పింఛన్‌పెంపు, వైఎస్సార్ ఆసరా, చేయూత, చేదోడు, విద్యాదీవెన, వసతి దీవెనలతోపాటు డ్వాక్రా మహిళలకు రుణమాఫీ, వడ్డీలేని రుణాలతో పాటు అనేక పథకాలను వైఎస్సార్ ప్రభుత్వంలో లబ్ధిదారులకు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు జనార్దన్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సర్పంచులు మధుసూదన్ రెడ్డి, రజినీకాంత్, మధుసూదన్‌రాయల్, రమేష్, రవియాదవ్, గుణవతి, ఎంపీటీసీలు గోళ్ల హరిప్రసాద్, యోవాన్, క్రిష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారిమేఘున్, శిలంబరసన్, గుండుసాయి. సాయిక్రిష్ణ, రమణ, జ్యోతిరెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, భానుమూర్తిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలతో పాటు కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



చిత్తూరు: సంజయ్‌గాంధీనగర్‌లో పర్యటిస్తున్న విజయానందరెడ్డి



గుడిపాల: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయానందరెడ్డి

క్లుప్తంగా

మహిళలంతా సిద్ధమే



మంత్రిని కలిసిన శైలజాచరణ్‌రెడ్డి

ఐరాల: రానున్న ఎన్నికల్లో జగనన్న గెలిపించేందుకు మహిళలంతా సిద్ధంగా ఉన్నారని మహిళ, శిశు సంక్షేమ శాఖ రాయలసీమ రీజినల్ చైర్‌పర్సన్ శైలాజచరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాతపాళ్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభకు విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శైలజా చరణ్‌రెడ్డి దంపతులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

స్పందన రద్దు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందనను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలు అమల్లో ఉండడం వల్ల స్పందనను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు.

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



శిలాఫలకాలను మూయిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలో ఎన్నికల నియమ నిబంధనలు పక్కాగా అమలు చేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ అరుణ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. నగరంలో ఎన్నికల కోడ్ అమలవుతున్న తీరుపై ఆదివారం ఉదయం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. వాటర్ ప్లాంట్ వద్ద రాజకీయపరమైన పెయింటింగ్స్‌ను, నేతల ఫొటోలపై రంగులు వేయించారు. పార్టీలకు సంబంధించిన జెండాలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. గోడలపై రాసిన రాతలను, బొమ్మలకు పూర్తిస్థాయిలో తెల్ల పెయింట్ పూయాలన్నారు. నగరంలోని చర్చి వీధి, పలమనేరు రోడ్డు, తిరుపతి రోడ్డు, వేలూరు రోడ్, ఎమ్.జి.ఆర్ వీధి, సి బి రోడ్, పుత్తూరు రోడ్డు, గాంధీ రోడ్, కొంగారెడ్డిపల్లి ప్రాంతాల్లో కమిషనర్ తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ భవనాలు కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా ఏమైనా ఫిర్యాదులు వస్తే సత్వరం స్పందించడానికి వీలుగా మొబైల్ బృందాలను ఏర్పాటు చేయించారు. ఎన్నికలకు సంబంధించిన విధులను పక్కాగా, పారదర్శకంగా నిర్వహించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ఏసీపీ రామకృష్ణుడు, ఇన్‌చార్జి ఎంహెచ్వో చిన్నయ్య, సీఎంఎం గోపి, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్స్పెక్టర్ లోకానాథం, తదితరులు ఉన్నారు.


క్రమశిక్షణ అలవర్చుకోవాలి



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలని న్యూయార్క్ పాఠశాల చైర్మన్ శ్రీధర్ అన్నారు. నగరంలోని మురుగానపల్లిలో ఉన్న న్యూయార్క్ పాఠశాలలో ఆదివారం ఘనంగా పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. అందులో చిన్నారుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. పలు పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చదువుతోనే సమాజాభివృద్ధి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నిర్వాహకులు

గుడిపాల: చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఈవో గణపతి అన్నారు. మండల కేంద్రంలోని సీఎస్ఆర్ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఆయన జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీపడి చదివితే సమాజాభివృద్ధి వేగవంతంగా సాగుతుందని చెప్పారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఆర్ కళాశాల అధినేత లోకేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తవణంపల్లెలో రెండు పరీక్ష కేంద్రాలు

తవణంపల్లె: మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖాధికారులు హేమలత, త్యాగరాజులు రెడ్డి తెలిపారు. అరగొండలో 210 మంది, తవణంపల్లెలో 142 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు.



42 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని 43వ వసంతంలోకి అడుగు పెడుతున్న

డా॥ రామలక్ష్మి నర్సింగ్ హోం

#17-434, సుందరయ్యర్ వీధి, చిత్తూరు.

అత్యున్నతమైన నైపుణ్యం కలిగి, ఆధునాతన పద్ధతిలో విశిష్ట సేవలను అందిస్తూ, అందరి మన్నలను పొందుతున్న

డా॥ కె. రామలక్ష్మమ్మ గారికి,
డా॥ సి. నిరంజన్ రెడ్డి గారికి,
డా॥ పి. రోజా ప్రియ గారికి,

హృదయపూర్వక అభినందనలు,

ఇట్లు:
డా॥ రామలక్ష్మి నర్సింగ్ హోమ్ సిబ్బంది